క్లుప్తంగా

కంబాల శివలీలకు పురస్కారం



కనగల్ : మండల కేంద్రానికి చెందిన న్యూ కంబాల శివలీల ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు కంబాల శివలీలకు పద్మచక్ర పురస్కారం దక్కింది. తాను చేస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తించి మనం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ చక్రవర్తి చేతుల మీదుగా ఈ నెల 11న హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో పురస్కారం అందుకోనున్నట్లు మంగళవారం శివలీల తెలిపారు.

మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాతృమూర్తి మృతి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

చిట్యాల: మండలంలోని పెద్దకాపర్తి గ్రామానికి చెందిన వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కాటం వెంకటేశం తల్లి యాదమ్మ (70) గుండెపోటుతో మంగళవారం మృతి చెందింది. ఆమె మృతదేహాన్ని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు కందిమళ్ల శిశుపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంత్రులకు ఆహ్వానం



మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసిన బీసీ సంఘం నాయకులు

నల్లగొండ టౌన్ : జిల్లా కేంద్రంలోని బీసీ భవన్ వద్ద ఈ నెల 13న నిర్వహించనున్న సావిత్రీబాయి పూలే, మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమానికి రావాలని బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలను బీసీ సంఘం నాయకులు ఆహ్వానించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు చక్రహరి రామరాజు, ప్రధాన కార్యదర్శి నేలపట్ల సత్యనారాయణ, గౌరవ అధ్యక్షుడు కంది సూర్యనారాయణ, ఉపాధ్యక్షులు నకిరెకంటి కాశయ్యగౌడ్, కేశబోయిన శంకర్, ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కేసు నమోదు

రామగిరి(నల్లగొండ): చోరీ జరిగిన సంఘటనలో మంగళవారం తిప్పర్తి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, ఎంఆర్‌సీ సెంటర్‌లో ఇటీవల ఇన్వర్టర్ బ్యాటరీలు చోరీకి గురయ్యాయి. కాగా ఈ విషయమై ప్రధానోపాధ్యాయుడు నరసింహనాయక్ గతంలో ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ డి.రాజు తెలిపారు.

నేడు కార్మికుల ధర్నా

మిర్యాలగూడ : దేశవ్యాప్తంగా బుధవారం కార్మికుల కోరికల దినంగా పాటించాలని, అందులో భాగంగా జిల్లా, మండలాల్లో నిర్వహించే ధర్నాలో కార్మికులు పాల్గొనాలని సీఐటీయూ దామరచర్ల మండల కన్వీనర్ బైరం దయానంద్ అన్నారు. మంగళవారం మడల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాన్ని అనుసరిస్తుందని ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ కార్మి విధానాలను నివారించి కార్మికుల హక్కులను కాపాడేందుకు దేశ వ్యాప్తంగా కార్మిక పోరాటాలను ఉధృతం చేయాలని అన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగ, కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరి, చంద్రకళ, అచ్చాలు, మంగా లక్ష్మీ, సంతోష్, కళమ్మ, జానకి పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం



గాలికి విరిగిపడిన విద్యుత్ స్తంభం

నార్కట్‌పల్లి : మండలంలోని నక్కలపల్లి గ్రామంలో మూల బావి, దేవతల బావి వ్యవసాయ భూములకు విద్యుత్ సరఫరా అయ్యే రెండు స్తంభాలు నెలరోజుల క్రితం గాలికి విరిగాయి. విద్యుత్ శాఖ అధికారులకు రైతులు తెలియజేసినా నేటికీ నూతన స్తంభాలు ఏర్పాటు చేయలేదు. బోరు మోటార్లకు విద్యుత్ సరఫరా లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దాదాపు ఇరవై ఎకరాల భూమి ఇప్పటి వరకు సాగు చేయకుండా ఉన్నారు. సంబంధిత అధికారులు స్పందించి నూతన స్తంభాలు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

విద్యార్థులకు తప్పని నడకయాతన

- సమయానుకూలంగా లేని ఆర్టీసీ బస్సులు
- ఆలస్యంగా పాఠశాలలకు వస్తున్న ఇతర గ్రామాల విద్యార్థులు
- ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్న మరికొందరు



అజ్జిలాపురం నుంచి యరగండ్లపల్లికి నడుచుకుంటూ వసున్న విద్యార్థులు (ఫైల్)



ఆదర్శ పాఠశాల వద్ద ఆటోల కోసం విద్యార్థుల ఎదురుచూపులు

మర్రిగూడ : మండలంలోని పలు గ్రామాలకు బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రజలు, ప్రయాణికులే కాకుండా ఇతర గ్రామాలకు వెళ్లి విద్యనభ్యసించే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్సులు లేకపోవడంతో 3.5నుంచి 4కి.మీ నడుచుకుంటూ వెళ్లి విద్యనభ్యసించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. మర్రిగూడ మండల పరిధిలోని యరగండ్లపల్లి హైస్కూలుకు పలు గ్రామాల నుంచి 6 నుంచి 10వ తరగతి విద్యార్థులు వచ్చి విద్యనభ్యసిస్తున్నారు. అజ్జిలాపురం, కొండూరు, తిరగండ్లపల్లి, నర్సింహాపురం నుంచి 24 మంది విద్యార్థులు ఈ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్నారు.

అజ్జిలాపురం నుంచి..

అజ్జిలాపురం నుంచి యరగండ్లపల్లి వరకు 4 కి.మీ పైగా దూరం ఉంది. ఈ గ్రామం నుంచి బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు నడుచుకుంటూ రావడం తప్ప మరో మార్గం లేదు. గంట నుంచి గంటన్నర ముందుగా ఇంటి నుంచి బయలుదేరి పాఠశాలకు వెళ్లాల్సి వస్తోందని విద్యార్థులు వాపోతున్నారు. పదో తరగతి విద్యార్థులు తరగతులకు సమయానుకూలంగా హాజరు కాలేకపోతున్నామని వాపోతున్నారు. బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని అనేకమార్లు కోరినట్లు ఆయా గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. సమయానుకూలంగా బస్సులు లేకపోగా వచ్చిన బస్సుల్లో మహిళలు కిక్కిరిసేలా ప్రయాణిస్తుండడంతో విద్యార్థులు ఆటోలను ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొంది.

ఎన్నిక సమయంలో వచ్చిన బస్సు..

మునుగోడు ఉప ఎన్నికకు పది రోజుల ముందు ఇబ్రహీంపట్నంకు చెందిన ఆర్టీసీ బస్సు పాఠశాల సమయానుకూలంగా ఉదయం, సాయంత్రం వేళల్లో మాల్ యరంగండ్లపల్లి మీదుగా అజ్జిలాపురంకు వెళ్లి వచ్చి మర్రిగూడలో రిటర్న్ అయ్యేది. ఆ సమయంలో విద్యార్థులతోపాటు ప్రయాణికులు కూడా ఇబ్బందులు లేకుండా ప్రయాణించేవారు. ఎన్నిక ముగిసిన 3వ రోజు నుంచే బస్సు సర్వీసును రద్దు చేశారు. గతంలో మాదిరిగానే అజ్జిలాపురం గ్రామానికి బస్సు సర్వీసును పునరుద్ధరించాలని విద్యార్థులు, గ్రామస్తులు కోరుతున్నారు.

బస్‌పాస్ ఉన్నప్పటికీ..

మర్రిగూడ ఆదర్శ పాఠశాలలో శివన్నగూడ, ఇందుర్తి, సరంపేట, రాంరెడ్డిపల్లి, కొండూరు, యరగండ్లపల్లి, తిరగండ్లపల్లి, తమ్మడపల్లి గ్రామాలకు చెందిన విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ప్రతి నెలా బస్ పాస్‌లు తీసుకుంటున్నప్పటికీ సమయానుకూలంగా బస్సులు లేకపోవడంతో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నామని విద్యార్థులు వాపోతున్నారు. మర్రిగూడ నుంచి యరగండ్లపల్లికి వెళ్లే విద్యార్థులు సాయంత్రం 7గంటల వరకు బస్సు కోసం ఎదురుచూడాల్సిన దుస్థితి నెలకొంది. ప్రజాప్రతినిధులు, ఆర్టీసీ అధికారులు స్పందించి పాఠశాల సమయానుకూలంగా బస్సులు నడపాలని ఆయా గ్రామాల ప్రజలు, విద్యార్థులు కోరుతున్నారు.

ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్....

ఒక గ్రామం నుంచి 3 కి.మీ దూరం ఉన్న మరో గ్రామానికి వెళ్లే ఒకటి నుంచి 5వ తరగతి విద్యార్థులకు రూ.400, 6–8వ తరగతి చదివే విద్యార్థులకు రూ.600 ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్ ప్రభుత్వం చెల్లిస్తోంది. బస్సు సౌకర్యం లేని గ్రామాల విద్యార్థులకు ప్రభుత్వం ఈ అలవెన్స్ ఇస్తోంది.

నడుచుకుంటూ వస్తున్నాం



నిత్యం మా ఊరి నుంచి పాఠశాలకు నడుచుకుంటూనే వస్తున్నాం. ఎవరైనా లిఫ్ట్ ఇస్తే తప్ప పాఠశాలకు సమయానికి చేరుకునే పరిస్థితి కనిపించడం లేదు. గతంలో మాదిరిగా అధికారులు బస్సులు ఏర్పాటు చేయాలి. నడిచే సమయం చదువుకోవడానికి ఉపయోగపడుతుంది.

–నేనావత్ శివాని, 8వ తరగతి విద్యార్థిని, అజ్జిలాపురం

ఆటోకు వస్తున్నాం



మా ఊరి నుంచి బస్సులు సమయానికి రాకపోవడంతో ఆటోల్లో వస్తున్నాం. బస్సులు వస్తే బస్‌పాస్ తీసుకుని బస్సులో ప్రయాణించేవాళ్లం. ఆటోకు రావాలి లేదంటే మా నాన్న వ్యవసాయ పనులు వదులుకోని స్కూల్‌కు బైక్‌పై తీసుకెళ్లి విడిచిపెట్టక తప్పని పరిస్థితి.

–వడ్డె శ్రీరామ్‌చరణ్, 9వ తరగతి విద్యార్థి, రాంరెడ్డిపల్లి

ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్ జమ అవుతుంది



బస్సు సౌకర్యం లేని గ్రామాల విద్యార్థుల వివరాలను నమోదు చేసుకోవడంతోపాటు వారికి ప్రభుత్వం నుంచి ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్ అందించే విధంగా చొరవ చూపుతున్నాం. అకడమిక్ చివరిలో విద్యార్థుల ఖాతాలోనే ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్ జమ అవుతుంది.

–గురువారావు, ఎంఈఓ

ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం



ర్యాలీ నిర్వహిస్తున్న ఏబీవీపీ నాయకులు

నల్లగొండ టూటౌన్: ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం నల్లగొండ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఎన్జీ కాలేజీ నుంచి పెద్ద గడియారం సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి జెండా ఆవిష్కరించారు. కార్యక్రమానికి ఏబీవీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీనాథ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ 5 వేల మందితో మొదలైన ఏబీవీపీ.. దేశం కోసం, విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేసి ప్రపంచంలోని అతిపెద్ద విద్యార్థి సంఘంగా నిలిచిందన్నారు. విపత్తులు సంభవించినప్పుడు ప్రాణాలు లెక్క చేయకుండా ఆర్మీ వ్యవస్థలా ఏబీవీపీ కార్యకర్తలు దేశసేవలో ముందుంటారన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా కన్వీనర్ ఆవుల సంపత్, అల్లి సింధు, శివకృష్ణ, కార్తీక్, వేణు, మణి, శివ, సూర్య, సాయి, వంశీ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎంజీయూలో..

నల్లగొండ రూరల్: మహాత్మగాంధీ యూనివర్సిటీలో మంగళవారం జాతీయ విద్యార్థి దినోత్సవం నిర్వహించారు. భారతమాత, స్వామి వివేకానంద చిత్రపటాలకు పూజా కార్యక్రమాలు నిర్వహించి జెండా ఆష్కరించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ ప్రాంత కార్యాలయ సమితి సభ్యుడు ప్రొఫెసర్ నవీన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మానేశ్వర్‌చారి మాట్లాడుతూ దేశ రాజధాని ఢిల్లీలో ప్రారంభమైన ఏబీవీపీ.. దేశ నలుమూలలా 50 లక్షల సభ్యత్వంతో అతిపెద్ద విద్యార్థి సంఘంగా ఏర్పడిందన్నారు. విద్యార్థి సమస్యలపై 75 ఏళ్లుగా ఏబీవీపీ అవిశ్రాంత పోరాటం నిర్వహించిందన్నారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ, సూర్యాపేట జిల్లాల సంఘటన కార్యదర్శి అఖిల్‌రెడ్డి, విభాగ్ సోషల్ మీడియా కన్వీనర్ జయేందర్, భాను, శ్రీశైలం, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

విద్యా హక్కు చట్టం అమలు చేయాలి



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

నల్లగొండ టౌన్ : జిల్లాలోని అన్ని పాఠశాలల్లో విద్యా హక్కు చట్టం అమలుచేసి గుర్తింపు లేని పాఠశాలలను రద్దు చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చేకూరి గణేశ్ ఆధ్వర్యంలో మంగళవారం డీఈఓ భిక్షపతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గణేశ్ మాట్లాడుతూ జిల్లా పరిధిలో ఉన్న అన్ని ప్రైవేటు పాఠశాలల్లో విద్యా హక్కు చట్టం ప్రకారం 25 శాతం పేద విద్యార్థులకు ఉచితంగా సీట్లు ఇవ్వాలన్నారు. చట్టాన్ని అమలు చేయని ప్రైవేటు పాఠశాలల అనుమతులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వసతులు లేని పాఠశాలలు, అధిక ధరలకు పాఠ్యపుస్తకాలు విక్రయిస్తున్న పాఠశాలలను గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ముదిగొండ వెంకటేశ్వర్లు, జిల్లా కన్వీనర్ నాగపాక అంజి తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు సన్మానం



సన్మానం పొందిన ఉపాధ్యాయులు

చిట్యాల: పట్టణంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో ఇన్నాళ్లు పనిచేసి మరో పాఠశాలకు బదిలీ అయిన పలువురు ఉపాధ్యాయులను మంగళవారం ఆ పాఠశాల ఆవరణలో ఘనంగా సన్మానించారు. హెచ్‌ఎం కరుణాకర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో బదిలీ అయిన ఉపాధ్యాయులు రవీందర్, రాధిక, రేవతి, కవిత, వనజ, శ్రీవిద్యలకు ఘనంగా వీడ్కోలు పలికారు. అనంతరం బదిలీపై చిట్యాలకు పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులు కోణం శ్రీనివాస్, సీహెచ్ శ్రీనివాస్, ఏ.కవిత, సీహెచ్.ప్రసన్న, సీహెచ్.శంకరయ్య, ఎండి.సాదిక్, జానకిలకు స్వాగతం పలుకుతూ సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

మర్రిగూడ : రైతులను ఆదుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని రైతుబంధు సమితి మండల మాజీ కన్వీనర్ బచ్చు రామకృష్ణ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వానాకాలంలో రైతు భరోసా నేటికీ అందలేదని, రైతు రుణమాఫీ హామీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రామిడి వెంకటరమణారెడ్డి, రాకొండ మధుసూదన్‌రెడ్డి, కొండ్రెడ్డి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫర్టిలైజర్ దుకాణాల తనిఖీ

మర్రిగూడ: రైతులకు అందించే ఎరువుల విషయంలో ఫర్టిలైజర్ దుకాణదారులు అవకతవకలకు పాల్పడవద్దని ఏఓ హేమలత అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను ఆమె తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు అందించే ఎరువులను మద్దతు ధరకు అందించాలన్నారు. నాసిరకం విత్తనాలు, ఎరువులను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. స్టాక్ బోర్డును దుకాణం ఎదుట ప్రదర్శించాలని సూచించారు. ఆమె వెంట ఏఈఓలు ఉన్నారు.

సిటీ బస్ సర్వీసు పొడిగించాలి

చిట్యాల: దిల్‌సుఖ్‌నగర్ నుంచి చౌటుప్పల్ వరకు ప్రస్తుతం నడుస్తున్న ఆర్టీసీ సిటీ బస్సు సర్వీసులను చిట్యాల వరకు పొడిగించాలని బీజేపీ నాయకుడు చికిలంమెట్ల అశోక్ మంగళవారం ఒక ప్రకటనలో ఆర్టీసీ అధికారులను కోరారు. ప్రస్తుతం కోదాడ, సూర్యాపేట, మిర్యాలగూడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సులు చిట్యాల వద్దకు వచ్చేసరికి ప్రయాణికులతో కిక్కిరిసి ఆగకుండానే వెళ్తున్నాయని అన్నారు. దీంతో చిట్యాల నుంచి హైదరాబాద్‌కు వెళ్లేందుకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.

రెండు బైక్‌లు ఢీ.. ఇద్దరికి గాయాలు



తీవ్రంగా గాయపడిన షరీఫ్



ఘటనా స్థలంలో చెల్లాచెదురుగా రెండు బైక్‌లు

కేతేపల్లి: మండలంలోని ఇనుపాముల శివారులో మంగళవారం సాయంత్రం రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం .. చివ్వెంల మండలం వట్టిఖమ్మంపహాడ్ గ్రామానికి చెందిన ఎస్‌కే షరీఫ్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. పని నిమిత్తం షరీఫ్ మంగళవారం రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌పై నకిరేకల్‌కు వెళ్లాడు. సాయంత్రం తిరిగి సూర్యాపేటకు వెళ్తుండగా మార్గమధ్యలో కేతేపల్లి మండలం ఇనుపాముల గ్రామ శివారులో విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై ఒక్కసారిగా డివైడర్ దాటుకొని అవతలి వైపు నుంచి మరో బైక్ వచ్చి షరీఫ్ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో షరీఫ్‌కు తీవ్ర గాయాలు కాగా మరో బైక్‌పై ప్రయాణిస్తున్న నకిరేకల్ మండలం మంగళపల్లి గ్రామానికి చెందిన రాచమళ్ల సతీష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు 108 వాహనంలో నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



చిట్యాల : నగదు అందజేస్తున్న యూనియన్ సభ్యులు



శాలిగౌరారం : ఆర్థికసాయం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

శాలిగౌరారం: అంబారిపేట, వల్లాల గ్రామాల్లో అనారోగ్యంతో బాధపడుతున్న బీఆర్ఎస్ నాయకుల కుటుంబాలకు తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ ఆర్థిక సహాయాన్ని అందించారు. అంబారిపేట మాజీ ఉప సర్పంచ్ మొలుగూరి యాకూబ్, వల్లాల గ్రామానికి చెందిన బింగి వీరయ్య కుటుంబీకులకు ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున మాజీ ఎమ్మెల్యే పంపిన ఆర్థిక సాయాన్ని స్థానిక నాయకులు మంగళవారం అందజేశారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అయితగోని వెంకన్న, వెంకట్‌రెడ్డి, దుబ్బ వెంకన్న పాల్గొన్నారు.

చిట్యాల: మండలంలోని తాళ్లవెల్లెంల గ్రామానికి నకిరేకంటి మారయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో ఆ గ్రామ ట్రాక్టర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సేకరించిన రూ.30,500 నగదును మంగళవారం రాత్రి బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. యూనియన్ అధ్యక్షుడు చెరుకుపల్లి రమేష్, ఉపాధ్యక్షుడు బత్తుల జనార్దన్, కోశాధికారి ఏరుకొండ నరేష్, బొడ్డుపల్లి శ్రీను, బత్తుల శ్రీశైలం, గోపగోని వెంకన్న, శ్రీను, స్వామి పాల్గొన్నారు.

రుణమాఫీ చేయాలని వినతి

రామగిరి(నల్లగొండ): రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని కోరుతూ బీజేపీ కిసాన్ మోర్చా నాయకులు మంగళవారం తిప్పర్తి తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. అదేవిధంగా రైతు భరోసా పథకం ద్వారా వానాకాలం పంట పెట్టుబడి సహాయానికి ఎకరానికి రూ.7500 చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి కంచర్ల విద్యాసాగర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు పల్లె ప్రకాష్, వడ్డే శ్రీనివాస్‌రెడ్డి, గంటెకంపు మధు, చింతరెడ్డి సందీప్‌రెడ్డి, వంగూరి రవి, నల్లబోతు రమేష్, శ్రీను, శంకర్, రమేష్, జానయ్య, సైదులు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యంలో తరుగు !

మునుగోడు: లబ్ధిదారులకు అందించే రేషన్ బియ్యంలో తరుగు వస్తున్నట్లు పలువురు రేషన్ దుకాణాల డీలర్లు ఆరోపిస్తున్నారు. మునుగోడు మండలంలో నూతనంగా మంజూరైన రేషన్ దుకాణాలను ఇటీవల ప్రారంభించారు. అందులో గుండ్లోరిగూడెం రేషన్ దుకాణం డీలర్‌కు చండూరు గోదాము నుంచి ఈ నెల 21 క్వింటాళ్ల బియ్యం రాగా.. అందులో 93 కేజీల బియ్యం తేడా వచ్చినట్లు పేర్కొన్నారు. బియ్యం బస్తాలను తూకం వేయగా 50 కేజీలు ఉండాల్సి బస్తాల్లో 39 కేజీలు, 46 నుంచి 48 కేజీల చొప్పున ఉన్నాయని తెలిపాడు. లబ్ధిదారులకు ఇవ్వాల్సిన బియ్యం తాము ఎక్కడి నుంచి తెచ్చి ఇవ్వాలో అర్థం కావడం లేదని డీలర్లు వాపోతున్నారు. సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని రేషన్ బియ్యం సరఫరాలో తరుగు రాకుండా చూడాలని మండలంలోని డీలర్లు కోరుతున్నారు.

పుస్తకం ఆవిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆర్డీఓ రవి

నల్లగొండ టూటౌన్: సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సముద్రాల మల్లికార్జున్ రచించిన బ్రీఫ్ హిస్టరీ ఆఫ్ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అనే ఆంగ్ల పుస్తకాన్ని మంగళవారం నల్లగొండ ఆర్డీఓ రవి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ వృద్ధుల హక్కులు, వారి సంక్షేమానికి సంబంధించిన విషయాలను పుస్తకంలో పొందుపరచడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పుస్తక రచయిత సముద్రాల మల్లికార్జున్, శ్రీనివాస్‌రెడ్డి, దేవేందర్ రెడ్డి, అశోక్, భిక్షపతి, పులిరాజు, రామ్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో చోరీ

కనగల్ : మండల పరిధిలోని జి యడవల్లి శ్రీ కంఠ మహేశ్వర స్వామి ఆలయంలో చోరీ జరిగింది. సోమవారం అర్ధరాత్రి దొంగలు ఆలయ గర్భగుడి తాళాలు పగులగొట్టి అమ్మవారి పుస్తెలతాడు, ఆలయ ఆవరణలో ఉన్న గంట ఎత్తుకెళ్లారు. దీంతో మంగళవారం గౌడ కులస్తులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విచారణ చేసి దొంగలను గుర్తిస్తామని పోలీసులు తెలిపారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న రాందాస్ శ్రీనివాస్

మర్రిగూడ : మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సహకారంతో మండలంలోని పలువురికి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాందాస్ శ్రీనివాస్ మంగళవారం పంపిణీ చేశారు. లెంకలపల్లి గ్రామానికి చెందిన కారింగు నరసింహకు రూ.15వేలు, మానిపాటి అనూషకు రూ.21వేలు, సరంపేటకు చెందిన మాడ్గుల భిక్షమయ్యకు రూ.21వేలు, వట్టిపల్లికి చెందిన పందుల లక్ష్మమ్మకు రూ.37వేలు, కమ్మగూడకు చెందిన ఏర్నిడి దిలీప్ రూ.43,500, ఇందుర్తికి చెందిన ఎస్.సైదులుకు రూ.27వేలు, కొట్టాలకు చెందిన మేతరి గాలయ్యకు రూ.54వేలు, గంట సునీతకు మంజూరైన రూ.15వేలను పంపిణి చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మేతరి యాదయ్య, లింగారెడ్డి, చాపల వరి, మార్నెని లూర్దయ్య, ప్రశాంత్, గంట యాదయ్య, మల్లేష్, జంగిలి రవి, పదం రవి, పోకల నరసింహ, వెన్నమల్ల నరసింహ, వెంకట్‌రెడ్డి, మెండు లింగయ్య, భిక్షమాచారి, కల్లు రాంరెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్లు నిలిపివేయాలని నిరసన



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

మర్రిగూడ : మండల పరిధిలోని ఖుదాబాక్షపల్లి గ్రామంలో సర్వే నం.34 నుంచి 50 వరకు గల భూముల రిజిస్ట్రేషన్లు నిలిపివేయాలని కోరుతూ ఆ గ్రామస్తులు మంగళవారం మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ తమ భూములు అక్రమ పట్టా పొందేందుకు పలువురు ప్రయత్నిస్తున్నారని, ఆ రిజిస్ట్రేషన్లను నిలుపుదల చేయాలని కోరారు. అనంతరం బక్క శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రంలో పేర్కొన్నట్లు గ్రామస్తులు తెలిపారు.

పారిశుద్ధ్యంపై పట్టింపు ఏది !

- డ్రెయినేజీలు లేక రోడ్డుపై పారుతున్న మురుగు
- దుర్వాసన, దోమలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పొంచిఉన్న సీజనల్ వ్యాధులు



ఈ ఫొటోలో కనిపిస్తున్నది తిప్పర్తి మండల కేంద్రంలోని లవిశెట్టి లక్ష్మణ్‌కు చెందిన ఇల్లు. ఇంటిని ఆనుకొని ముస్లింలకు చెందిన శ్మశానవాటిక ఉంది. దాంట్లో పెద్ద పాడుబడిన బావి ఉండడంతో గోడ ఎన్నిసార్లు నిర్మించినా కూలిపోతోంది. అడ్డుగా గోడ లేకపోవడంతో పందులు విచ్చలవిడిగా ఇంటిలోకి ప్రవేశిస్తున్నాయి.



తిప్పర్తిలో నకిరేకల్ రోడ్డు వెంట పారుతున్న మురుగు



మహాలక్ష్మి గుడి రోడ్డులో సీసీ రోడ్డుపై నిలిచిన మురుగు

రామగిరి(నల్లగొండ): తిప్పర్తి మండల పరిధిలోని పలు గ్రామాల్లో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. డ్రెయినేజీల్లో చెత్తాచెదారం పేరుకుపోవడంతో మురుగు సాఫీగా పారక రోడ్డుపై ప్రవహిస్తోంది. దీంతో రోడ్డంతా మురుగుతో నిండి దుర్వాసన వెదజల్లుతోందని స్థానికులు వాపోతున్నారు. తిప్పర్తి మండల కేంద్రంలోని ముస్లిం శ్మశానవాటికలో చెత్త పేరుకుపోవడంతో చుట్టుపక్కల నివాసముంటున్నవారు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. అలాగే మహాలక్ష్మి గుడికి వెళ్లే దారిలో సీసీ రోడ్డుపై మురుగు పారుతోంది. అంతేకాకుండా పలు గ్రామాల్లోని డ్రెయినేజీల్లో మురుగు ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో దుర్వాసనతోపాటు దోమలతో రాత్రివేళల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు పేర్కొంటున్నారు.

విష జ్వరాలబారిన పడుతున్న ప్రజలు

దోమల వల్ల విషజ్వరాల బారిన పడుతున్నామని, అయినా గ్రామ ప్రత్యేక అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెత్త, మురుగు నిల్వ ఉన్న ప్రదేశాల్లో గ్రామపంచాయతీ సిబ్బంది కనీసం బ్లీచింగ్ పౌడర్ కూడా చల్లడం లేదని వాపోతున్నారు. ప్రత్యేక అధికారులు స్పందించి డ్రెయినేజీలను శుభ్రం చేయించి మురుగు రోడ్డుమీదకు రాకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఇళ్లలోకి పందులు వస్తున్నాయి



మా ఇంటిని ఆనుకుని ముస్లింల శ్మశానవాటిక ఉంది. మధ్యలో ప్రహరీ లేకపోవడంతో పందులు ఇళ్లలోకి వస్తున్నాయి. సమస్యను తిప్పర్తి ఎంపీడీఓ దృష్టికి పలుమార్లు తీసుకెళ్లాను. అయినప్పటికీ అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేదు. ఇంట్లో జ్వరాలబారిన పడుతున్నారు.

–లవిశెట్టి లక్ష్మణ్

డ్రెయినేజీ నిర్మించాలి



మురుగు కాలువలు లేకపోవడంతో ఇళ్లల్లో వాడుకున్న నీరు నేరుగా రోడ్డుపైకి వస్తోంది. దుర్వాసనతోపాటు దోమలు విపరీతంగా వ్యాపిస్తున్నాయి. అధికారులు స్పందించి డ్రెయినేజీ నిర్మాణం చేపట్టాలి.

–కస్పరాజు నరేష్